

# కాసులు

పైడిశ్రీ

"పోస్ట్!"

అద్దంముందర నిలబడి తన పందొమ్మిదేళ్ళ ప్రాయాన్ని అడిగిన ప్రశ్న మళ్ళీ అడుగుతూ తనపై తానే జాలిపడుతున్న కాసులు ఉలిక్కిపడి వీధిలోకి చూసింది.

బైట సైకిల్ స్టాండ్ వేస్తున్న తపాలా బంట్రోతు కనిపించేడు!

లేచి గబగబా ఎదురెళ్ళి అతడు అందించిన ఇన్లాండ్ కవర్ తీసుకుని దానివేపే పరిశీలనగా చూస్తూ లోపలి కొచ్చింది కాసులు.

కాసులు. కేరాఫ్ సత్తెమ్మ....! ఉత్తరం తనకే!

ఫ్రం అడ్రసు చూసిన కాసులుకి ఓ క్షణంపాటు ఊపిరి స్తంభించిపోయినట్లనిపించింది, గాభరాగా తన గదిలోకెళ్ళి పందిరిమంచంమీద బోర్లా పడుకుని ఉత్తరం చూసింది

"కాసులూ!

నా కెవరబ్బా ఉత్తరం రాసేవాళ్ళు అని ఆశ్చర్యపడుతున్నావా? నేను! నీ 'మిత్రా'ని గుర్తొచ్చేనా? పెళ్ళిచేసుకుంటానని మాటిచ్చి త్వరలో కనిపిస్తానని మాటిచ్చి మూణ్ణెల్లతర్వాతనా పలకరించడం అని కన్నెర్రజేయకు. ఏం చెయ్యను, పరిస్థితుల్లా వచ్చేయి. ఆ రోజు నీ దగ్గర్నుంచి వెళ్ళిన మర్నాడే నిన్ను పెళ్ళాడతానని మాటిచ్చిన సంగతి మా యింట్లో చెప్పేను.

"ఒళ్ళమ్ముకుంటే తప్ప గంజినీళ్ళు తాగలేని ఆ బజారుదానితోనా నీ పెళ్ళి". అంటూ యింట్లోవాళ్ళంతా కల్లుతాగిన కోతుల్లా చిందులు త్రొక్కేరు. నీ మీద నాకు కలిగిన సదభిప్రాయాన్ని, నమ్మకాన్ని వివరంగా విడమరచి చెప్పేను. ఊహూ.... నసేమిరా నువ్వా పెళ్ళిచేసుకోడానికి వీల్లేదని మొండిపట్టు పట్టేరు. కనీసం స్నేహితులైనా నన్నర్థం చేసుకుంటారనుకున్నాను. అదీ లేదు. పైగా ఎగతాళి చేస్తూ ఎత్తిపొడుపు మాటలన్నారు కాసులూ.... అప్పుడప్పుడు నేను ఎందుకనో మానసికంగా బలహీనుణ్ణయిపోతుంటాను ఏమీ దరిదోచని పరిస్థితులలో ఒకానొక భయంకరమైన స్తబ్దత నన్నావరిస్తుంది. ఆ సమయంలో బయట అందరూ ఎప్పుడయితే ఎగతాళిచేసేరో ఏమాత్రం భావస్వాతంత్ర్యం (యింట్లో) లేని నేను మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాను__"

చదువుతున్న కాసులు ఒళ్ళు ఒక్కసారిగా ఝల్లుమంది. సుడిగాలి గేలిచేసిన చిగురాకులా గజగజలాడిపోయిందామె.

"....కానీ నన్ను తిరిగి బ్రతికించి నాకు చావడానిక్కూడా స్వాతంత్ర్యం లేదని తేల్చేసారు. రెండునెలల పాటు ఏమీ తెలీని అయోమయ స్థితిలో వుండిపోయేను. రచనల్లో పాత్రలకు జీవం పోస్తూ, వాళ్ళకు శతవిధాలా జీవించే పరిస్థితులు సృష్టించే నేను నిజ జీవితంలో ఎంతటి పిరికివాణ్నో అనే విషయం తల్చుకుంటే ఆశ్చర్యం వేసింది. నిన్ననే హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయ్యేను. ఇంకా నేను కొంతశక్తిని కూడగట్టుకునే దాక యింట్లోంచి కదలనీయవద్దని డాక్టరు గారు ఆదేశించేరు యింట్లోవాళ్ళని. అయినా నాకోసం నువ్వు అక్కడ వేయికళ్ళతో ఎదురుతెన్నులు

చూస్తుంటావని యీ ఉత్తరం రాస్తున్నాను...."

కాసులు శరీరంలో ఒకలాంటి విద్యుత్తు.

ఒకలాంటి చైతన్యం! అది మనస్సు మారుమూలల్లో గడ్డకట్టుకుపోయిన గత జీవితపు జ్ఞాపకాల శైథిల్యాన్ని స్పృశిస్తూ అమృత పవనంలా సాగిపోయింది.

ఆమెలో ఒకలాంటి అలజడి!

"కాసులూ! నువ్వు సమాజం వెలివేసిన వేశ్యవేకావచ్చు. ఒళ్లమ్ముకుని పొట్టపోసుకునే అకటి చీకటి శిల్పానివే కావచ్చు. కానీ నీలో మాటలకందని మనుషుల బాహ్యనేత్రాలకు అగుపించని దివ్యతేజస్సు ఏదో వుంది. అది నాక్కావాలి. ఆ కాంతి కవాటాలు నా భావాలకు క్రొత్త లోకాలు చూపిస్తాయి. ఆ వెలుతురులో నేను స్నానం చెయ్యాలి. అందుకే నిన్ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను...."

ఉత్తరం చదువుతున్న కాసులు ఊపిరి ప్రవాహానికి ఏదో అడ్డంకు. ఆమె నుదురు నిండా గాజుపూసల్లాంటి చెమట బిందువులు!

"....నిన్ను పెళ్లిచేసుకుంటే యీ లోకం నన్ను ఆదర్శవంతుడనీ ధైర్యశాలి అని కీర్తిస్తుందని గాని, అనవసరపు బిరుదు ప్రధానాలు జరిపిస్తుందనిగానీ నిన్ను పెళ్లాడ్డం లేదు. జీవితంపట్ల నీలో పాతుకుపోయిన చేదువూహల్ని, చిరుత ప్రాయంలోనే నీకు కలిగిన అసహ్యాన్ని, జరిధిలా నిన్ను ఆవరించిన స్తబ్దతని పారద్రోలాలని సాటిమనిషిగా రవంత స్వార్థంతో కూడిన యీ నిర్ణయం తీసుకున్నాను...."

మిగతా ఉత్తరాన్ని యింకా వేగంగా చదవాలని కాబోలు ఆమె కళ్లలోంచి జలజల రాలిపడ్డాయి కన్నీటి చుక్కలు.

ఆమె చేతి వ్రేళ్లలో సన్నటి కంపనలు.


నరాల దారుల్లో ఒక సంచలనం, ఒక ప్రజ్వలనం.

ఉన్నట్టుండి వల్లకాడు కాస్తా మల్లెతోటగా మారినట్టూ, తన కెవరో తెల్లటి దేవతలా వస్త్రాలు తొడిగి నక్షత్రాల మధ్య నిలబెట్టినట్టూ .... .... వూహల పరంపర.

గాయంలోంచి స్రవించే నెత్తుటిసెలలా ఉలికిఉలికి వస్తున్న 'ఆనంద బాష్పాల్ని' అరచేతులలో ఆత్రవ్యస్తంగా తుడుచుకుంటూ మిగతా ఉత్తరంకేసి దృష్టి సారించింది.

"...ఈ ఉత్తరం నీకు రేపు అందుతుంది. ఎల్లుండి రాత్రి అంటే 22వ తేదీ రాత్రి పదిగంటలకల్లా నువ్వు తయారై వూరి చివరవున్న యాదగిరి






పార్కు దగ్గరికొచ్చెయ్యి. అక్కడ నీకోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తూంటాను.

ఎల్లుండి కలుద్దాం!

నీ "మిత్రా",

ఉత్తరం సాంతం చదివేక గుండెలకేసి ఆప్యాయంగా అదుముకుంది కాసులు.

ఆ క్షణాన ఆమె కళ్లముందు ఒకటే దృశ్యం.

అది- మహా శూన్యం. ఆ శూన్యంలో ఉత్సాహంగా ఉన్మత్తంగా పసిపాపల్లా .. తెరచాపల్లా .... రెపరెపలాడుతూ కేరింతలు కొడుతూ గాల్లో తేలుతూ అతడు! ఆమె!

"ఎవుర్దగ్గిర్నించే కాసులా, ఉత్తరం?" గదిలో కొస్తూ అడిగింది సత్తెమ్మ. ఆమెను చూసి ఉత్తరం చటుక్కున దెగుంట్లో దాచేసుకుని ఏమీ తెలీనట్టు వెనక్కి తిరిగింది కాసులు.

"ఉత్తరమా! మనక్కాదులే. అవతల గొందిలో వుండే కాసిమ్మకి. ఆ చక్కారపు చచ్చినోడు అడ్రసు సరిగ్గా చూడకుండా మనింటిముందర ఆగి కే కే పే దు కాసిమ్మంటే నేనే ననుకుని. కాదన్చెప్పి పంపించేశా" గడగడా అబద్ధమాడేసింది కాసులు.

"అట్టాగా. అది మనకే ననుకున్నాలే" అంటూ జాలిగా, పీలగా, కోలగా ఓ నవ్వు నవ్వి బైటికి నడిచింది సత్తెమ్మ. ఆమె అలా బైటికెళ్లగానే తలుపులు ధడేల్న మూసేసి వచ్చి, కట్టెమంచం మీద బోర్లా పడింది.

మనసు గతంలోకి పరుగెత్తసాగింది.

ఆ రోజు అతను తన కిచ్చిన మాట

నిలబెట్టుకున్నాడు.

ఆరోజు అతను తనకిచ్చిన మాట....

ఆ రోజు—

ఎప్పట్లాగే ప్రొద్దుగూకింది. ఎప్పట్లాగే చీకటి పడింది. ఎప్పట్లాగే ఆ చీకటి చిక్కగా అయి 'ఆయిళ్ళ'మీద చిక్కగా పేరుకుపోయింది.

వరుసగా యిళ్ళనెంబర్లు చూసుకుంటూ గబగబా అంగలెయ్య సాగేడు విష్ణుమూర్తి. అతని మనసంతా గందరగోళంగా వుంది. తను డబ్బుకి ఆశపడి యీ పందేనికి ఒప్పుకున్నాడు.

ఆ పందెం — కాసుల్ని, కష్టమర్లని విసుక్కుంటూ పట్టుకుని పది నిమిషాలైనా దగ్గర వుంచుకోనక బైటికి నెట్టేసే సౌందర్యమూర్తి కాసుల్ని తను పైసా ఖర్చులేకుండా అనుభవించాలి యీ రాత్రంతా. అలా ఆమెతో రాత్రంతా 'ఫ్రీగా' గడపి గనుక సుఖంగా బైట పడితే తనకి అయిదువందలు వస్తాయి. కాసులు చేతిలో చిత్తుగా ఓడిపోయిన ఒక కాముకుడు కాసిన పందెం అది. దాన్ని ఎలాగైనాసరే తను గెలవాలి. కానీ ఎలా?

కాసులు చాలా మొండి ఘటం అని విన్నాడు. తన నవలు లోనికి రానిస్తుందా! తనని గనుక లోనికి రానిస్తే తన పథకం ఫలించినట్లే. కాసులు తనకు నచ్చినవాణి తనని మెచ్చినవాణ్ణి పెళ్ళి చేసుకుని పదహారణాల సంసార స్త్రీగా మారిపోవాలన్న ఆలోచనలో వున్నట్టు తనకి చూఛాయగా తెలిసింది. ప్రస్తుతం ఆ ట్రిక్కే ఆమె మీద ప్రయోగించబోతున్నాడు తను. ఫలిస్తే!

ఒక సౌందర్యరాశితో రాత్రంతా స్వర్గసుఖం ప్లస్ పందెం డబ్బు అయిదు వందలు!

వడివడిగా అంగలెయ్య సాగేడు విష్ణుమూర్తి.

* * *

తన వెనగ్గా తలుపులు మూసుకున్న చప్పుడు కావడంతో ఉలిక్కిపడి వెనక్కి చూసి, మొహమంతా చెమట్లు పడుతుండగా లోపలి బోల్టు వేసి, వెనుదిరిగేడు — విష్ణుమూర్తి.

ఎదురుగా సౌందర్యరాశి కాసులు!

ఆమెను చూస్తే ఆ క్షణాన ఎవరూ ఒళ్ళమ్ముకునే వేశ్య అనుకోరు. ఏ సినిమాతారో మామూలు డ్రస్సులో వుందని అనుకుంటారు లేక ఏ గొప్పింటి ఆడపడుచో చవకరకం బట్టల్లో దాక్కుండే అని ఊహిస్తారు. అవిడే కాసులు అంటే నమ్మశక్యం కాలేదు విష్ణుమూర్తికి. ఆమెవేపు గుడ్లప్పగించి చూడసాగేడు. ఆమెకూడా అతన్ని వింతగా నఖశిఖ పర్యంతం పరికించ సాగింది.



"కాసులు అంటే 'మీరే' కదూ!" గౌరవసూచకమైన 'మీరు' అనే పదాన్ని ఒత్తిపలుకుతూ తొలి అస్త్రం ఒదిలేడు విష్ణుమూర్తి. ఆ అస్త్రం తాలూకు రెస్పాన్స్ ఆమె కళ్లలో కనిపించి లోలోపలే సంబరపడ్డాడతను.

ఆమె అవాక్కయినట్టు అతనివేపే చూడసాగింది. అతను మళ్ళీ అన్నాడు.

"కాసులంటే 'మీరు' కాదా?"

"అవున్నేను!" ఊహల్లోంచి తేరుకుంటూ అందామె.

"మీతో కాస్తంత పనుండి వచ్చేను"

"ఇక్కడికి 'పని' లేకుండా రారెవ్వరూ," చురుక్కున జవాబిచ్చిందామె.

"అహహహఁ పనంటే... ఆ పని కాదు. ఐమీన్...వేరే పని" నసిగేడతను.

"వేరే పనా?" విస్తుపోతున్నట్లు రెప్పలార్పిందామె.

"యస్! అన్నట్లు నన్ను నేను పరిచయం చేసుకోలేదు కదూ. నా పేరు మిత్రా. ప్రస్తుతానికి నిరుద్యోగిని! పత్రికలకు కథలు రాస్తుంటాను. ఓ పత్రికవారి బలవంతం మీద వేశ్యాజీవితం మీద నవల రాస్తున్నాను. ఇంతవరకు ఇద్దర్ని ఇంటర్వ్యూ చేసి, వివరాలు రాసుకుంటాను. మీకేమైనా అభ్యంతరమా?" డైరీలోంచి పెన్నుతీసి 'మేటర్' రాసుకునేందుకన్నట్లు ఉద్యుక్తుడయ్యేడు విష్ణుమూర్తి.

ఆమెనుండి ఎటువంటి జవాబు లేదు.

అతడు తనని పవిత్రంగా చూడడం, మాటిమాటికి 'మీరు' అంటూ ఎంతో గౌరవంగా సంబోధించడం వంటి 'కొత్త విషయాలు' ఆమె అంత త్వరగా జీర్ణించుకోలేకపోతోంది.

ఈ గదిలోకి రాగానే యింతవరకు వచ్చిన మగాళ్ళంతా కనీసం తలుపైనా మాయకుండా తనని కౌగిలించుకొనేవాళ్ళు. తను కసిరికొట్టేదాకా తన శరీరంతో తమ అవసరం తీర్చుకొనేవాళ్లు. మరదలా అనో, కాస్తంత క్లాస్ అయితే డార్లింగ్ అనో సంబోధించేవారు. కానీ ఇతనేమిటి.. అందుకు విరుద్ధంగా!!

తనని 'మీరు' అని సంబోధిస్తున్నాడు. ఆ సంబోధనలో ఎంత అణకువ! అతనికీ తనకీ మధ్య దూరం కనీసం నాలుగడుగులైనా వుంటుంది. ఆ కూర్చోవడంలో ఎంత మర్యాద, హుందా!

ఆమె కన్నార్పకుండా అతన్నే పట్టి పట్టి చూస్తోంది.

"మీకు అభ్యంతరం అయితే...." విష్ణుమూర్తి లేచి నిలబడ్డాడు.

అతను అలా పైకి లేవడం చూసి స్పృహలోకొచ్చింది కాసులు.

"ఏమిటి లేచేరు? కూర్చోండి."

విష్ణుమూర్తి కూర్చున్నాడు అచ్చం అరబాల అమాయకుడిలా.

"ఏమిటన్నారు....?" అందుకు ఆసక్తిగా ముందుకు ఒంగుతూ.

ఆమెలో తన అస్త్రం తాలూకు కొట్టొచ్చినట్టు కనబడేసరికి విష్ణుమూర్తిలో కొత్త ఉత్సాహం ఉప్పెనలా పొంగింది.

"నేను మిమ్మల్ని ఇంటర్వ్యూ చెయ్యడానికొచ్చేను" అంటూ తను యిందాక చెప్పిన మాటల్నే రిపీట్ చేసేడతను.

"నన్నొక విటుడిగా భావించక హితుడిగా భావించి మనస్ఫూర్తిగా సమాధానాలివ్వండి" అంటూ డైరీ తెరిచేడు విష్ణుమూర్తి.

అలాగే నన్నట్లు ఆమె తలూపింది.

బైట నిలబడి తలుపు కంతల్లోంచి ఏదో వింత చూడాలన్నట్లు ఒళ్ళంతా కళ్లు చేసుకుని చూస్తున్న సత్తెమ్మ ఆశాభంగమైనట్లు అసంతృప్తిగా పెదవ్విరిచింది. అయినా ఆమె అక్కణ్ణించి కదల్లేదు. కాసులు విష్ణుమూర్తి ప్రశ్నలకు యిస్తున్న జవాబుల్ని తనూ వినసాగింది జాగ్రత్తగా. ఆ విషయం కాసులుకి తెలీదు. తెలిస్తే చచ్చినా తన కథ విష్ణుమూర్తికి చెప్పడానికి యిష్టపడేది కాదేమో!

• • •

"....తనని చేరదీసినవాళ్ళకి తప్ప తనకు తాను ఉపయోగపడని రూపాయి కాసులాంటిదే నా బ్రతుకు. మొత్తానికి ఎవరోగాని నా భవిష్యత్తు బాగా వూహించే నాకు 'కాసులు' అని పేరు పెట్టారు. నాకు ఊహ తెలిసిన దగ్గర్నుంచీ నన్ను చేరదీసిన వాళ్ళకి తప్ప నాకోసం నేను బ్రతికినట్లు గుర్తులేదు.... ఇంతవరకూ కూడా!

ఎవ్వరో ఓ పేరు తెలీని తిరుగుబోతు నన్ను గవర్నమెంటు ఆస్పత్రిలో కని పడేసిపోతే ఒక నర్సు నన్ను ఒక రూపాయికి అంకమ్మకి అమ్మేసిందట. నాకు ఊహ తెలిసేసరికి ఆమె పోషణలోనే వున్నాను. ఆవిడే నా తల్లి అనుకున్నాను. ఆవిడే నన్ను స్కూలు ఫైనల్ దాకా చదివించి ఆపేసింది. నేను కాలేజీ చదువుకెళ్తానన్నాను. ఆవిడ ససేమిరా ఒప్పుకోనంది. సరిగ్గా ఆ రోజుల్లోనే నేను పెద్దమనిషయ్యాను. నేను పెద్దమనిషినైన కొన్నాళ్ళకి. ఒక చీకటి గదిలో పెట్టి తాళంవేసి నన్ను ఓ పేరుతెలీని కుర్రాడితో గడపమంది అంకమ్మ. నేను తిట్టేను ఆమె కోప్పడింది. ఎదురు తిరిగేను. శాసించింది. ఏడ్చేను. అప్పుడు నా జన్మ రహస్యం చెప్పి నన్ను తను డబ్బులిచ్చి కొనుక్కోవడంలో వున్న ఉద్దేశ్యమేమిటో విడమర్చి చెప్పింది. ఆవాక్క




య్యేను. నిస్సహాయురాలిలా రోదించేను. సరిగ్గా ఆరోజు రాత్రే మగాడి స్పర్శ చవి చూసి జీవితంలో అత్యంత విలువైన దాన్ని పోగొట్టుకున్నాను.

అప్పటిదాకా సమతల ప్రదేశంలో సాగే నదిలా పయనించిన నా జీవితం ఒక్కసారిగా అనుకోని మలుపు తిరిగి అడవుల్లోకి దారితీసింది. ఎన్నో లోయల్ని బండరాళ్ళని దాటుకుంటూ పయనించ సాగింది.

అంకమ్మ దగ్గర్నుంచి పారిపోయి బెజవాడ చేరేను. ఒంటరిగా కనిపించిన నా చుట్టూ ఎందరో మగాళ్లు చేరేరు. ఆ రోజు నా కడుపులో కణకణ మండుతున్న ఆకలి నాచేత మనస్ఫూర్తిగా వ్యభిచారం చేయించింది. ఆ సమయానికి నాకు అంతకన్నా దారిలేకపోయింది. ఆ తర్వాత నేను చేసినపనికి పరిహారంగా గుక్కెడు విషంత్రాగి చద్దామనిపించింది. తమాషా ఏమిటంటే ఆ విషం సీసా కొనుక్కోవడానిక్కూడా వ్యభిచారం చెయ్యవలసిన అవసరమేర్పడింది. అందుకు నా మనస్సు ఒప్పుకోలేదు. కృష్ణలో దూకి చద్దామనిపించింది. అదే చేసేను. కానీ పంకజం అనే ఆవిడ నాకు ఆ అవకాశం యివ్వక తన యింటికి తీసుకుపోయి నన్ను డబ్బు చేసుకోసాగింది. నా మొహాన పిడికెడు మెతుకులు వేస్తూ. అక్కణ్ణించి పారిపోయి వస్తూవస్తూ రంగమ్మ చేతికి చిక్కేను. ఆ తర్వాత బంగారమ్మ, వెంకటేశ్వర్లు, నాంచారి, అసిరమ్మ మొదలైన వాళ్ళ చేతులు మారి ఆఖరికి యీ సత్తెమ్మ పాలబడ్డాను. చిత్రంఏమిటంటే జీవితంలో నా జీవితంతో ఆడుకున్నది ఎక్కువగా సాటి ఆడవాళ్లే! సాటి ఆడదాన్నన్న జాలికూడా లేకుండా నాచేత వ్యభిచారం చేయించేరు. చేయిస్తున్నారు. వేలకొద్దీ సంపాయించేరు. సంపాయించుకుంటున్నారు. నేను వ్యభిచారానికి దిగిన తొలి రోజుల్లో తారసపడ్డ ప్రతిమగవాణ్ణీ అడిగేను నన్ను పెళ్లి చేసుకుని ఎటైనా తీసుకుపొమ్మని. ఒక్కడూ ముందుకు రాలేదు. అర్థించిన మూడుముళ్ళబంధాల్ని ప్రతివాడు మూడు నిమిషాల సంబంధంగా మార్చేసి వెళ్లిపోయేరు. ఈ మగజాతి మీద విసుగేసింది. అయినా నన్ను పోషించేవాళ్లకోసం మగవాడి క్రింద మల్లెలతో పాటు నేనూ నలగక తప్ప లేదు....!" ఏడ్వడానిక్కూడా స్వేచ్ఛ లేనట్లు ఆమె కళ్లు ఎండుటాకుల్లా గలగల లాడేయి.

అప్పటిదాకా ఆమె కథ వింటూ అచేతనుడైన విష్ణుమూర్తి సచేతనుడు కావడానికి కాస్తంత టైం పట్టింది.

"ఇంకా మీకు యీ రొంపిలో బ్రతకాలని వుందా?" ఆమెవైపు పరిశీలనగా

చూస్తూ అడిగేడు విష్ణుమూర్తి.

"ఇప్పుడే కాదు ఎప్పుడూ లేదు." వెంటనే సమాధానమిచ్చిందామె!

"మరి మీరు యింకా యీ చీకట్లోనే వుండిపోయారెందుకని?"

"వెలుతురు చూపించే మగాడు కనిపించక!"

అప్రతిభుడయ్యాడతను ఆమె సమాధానానికి.

"ఒకవేళ కనిపిస్తే?"

"ఈ చీకటి జీవితానికి స్వస్తిచెప్పి కొత్తజీవితాన్ని ఆరంభించడానికి నేను సిద్ధం. అయితే ఆ దొరికే మగాడు నన్నూ, నా గతాన్ని క్షమించగల విశాల హృదయుడై వుండాలి."

"అటువంటివాడు మీకు జీవితంలో ఎప్పటికైనా తారసపడవచ్చునన్న ఆశ మీలో వుందా?"

ఈ ప్రశ్నకు ఆమె చివుక్కున తలెత్తి చూసింది. వెడల్పాటి కాటుక కళ్ళలోంచి వెచ్చటి కన్నీటిబొట్లు!

చలించిపోయేడు విష్ణుమూర్తి.

"కన్నీళ్లు కారుస్తున్నారా! అయామ్ సారీ.... నా ప్రశ్న మిమ్మల్ని బాధపెట్టినట్టుంది!?"

"పర్వాలేదు!" కొనవ్రేళ్ళతో కన్నీళ్లు తుడుచుకుంటూ అంది కాసులు; ఇంకా అతను ఏమైనా అడిగితే బావుణ్ణు అన్న కోరిక ఆమె తడికన్నుల్లో రెపరెపలాడింది.

"ఇప్పుడు నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను, అనుకోండి. అందుకు మీరిచ్చే సమాధానమేమిటి?"

ఆ ప్రశ్న విని పూనకంవచ్చినదాన్లా నవ్వింది కాసులు.

"ఎందుకలా నవ్వుతున్నారు?" గాభరాగా అడిగేడతను.

"అడిగేవాడికి చెప్పేవాడు లోకువ అనే సామెత గుర్తొచ్చి" అనేసి మళ్ళీ నవ్వసాగిందామె., గదంతా ప్రతిధ్వనించేట్టు.

"ప్లీజ్! అలా నవ్వకండి!"

"ఏం.... ఎందుకని?"

"నా ప్రశ్నకు సరైన సమాధానం యిచ్చి నవ్వండి."

"నేను యివ్వను."


"అదేం?"

"చేతల్లో చూపిస్తాను. చూపించనా." అంటూ అమాంతం విష్ణుమూర్తి మీదికి ఆవేశంగా ఎగబడి అతని మొహాన్నంతా ముద్దులతో ముంచెత్తి ఉక్కిరిబిక్కిరి చేసేసింది కాసులు. "ఇదీ నా సమాధానం!" అతడు ఆ ముద్దులమత్తులోంచి తేరుకునేసరికి అయిదు నిముషాలు పట్టింది.

వెంటనే అతని వదనం గంభీరంగా మారిపోయింది.

"కాసులుగారూ....! 'మీలోని' పవిత్ర స్త్రీమూర్తి పవిత్ర జీవితాన్ని గడప






డానికి సంసిద్ధంగావుంది అని భావిస్తున్నాను. అందుకే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. మీకు ఇష్టమేనా?"

ఒక్కక్షణంపాటు కాసులు స్థాణువులా అయిపోయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు. నా మాటల్లో నిజం ఎంతవుంది అని అంచనా వేస్తున్నారా!? మీ అంచనాలు రైటో తప్పో రేపు మీ మెడలో మూడుముళ్ల వేశాక తేల్చుకుందురుగాని.... కమాన్ నా ప్రశ్నకు సమాధాన మివ్వండి!" అతని కంఠంలో అదోలాంటి ధార్ఢ్యం.

ఆమెలో మౌనం!

కళ్లలోంచి ధారాపాతంగా కన్నీళ్లు! అతని పాదాలపై ఆ కన్నీటి అనవాళ్లు!

"మౌనం అంగీకార సూచకం అంటారు. అది నిజమే ననుకుంటాను" అంటూ మెల్లగా ఆమె 'పాణిగ్రహణం' చేసేడు విష్ణుమూర్తి. అప్పుడు అతని మనసులో తన పథకం ఫలించినందుకు అమితమైన సంతోషమూ, తను పందెం గెలిచినందుగ్గాను తనకి రాబోయే అయిదు వందల రూపాయల నోట్లు రంగురంగుల దృశ్యాలుగా కనిపించి అతని మనసు ఆనంద తరంగితమైంది.

కాసులుకి అదేమీ తెలీదు. గువ్వపిట్టలా అతని కౌగిట్లో కరిగిపోయింది.

బైట్నుంచి తలుపుకంతలోంచి యీ దృశ్యం చూసి, అప్పటిదాకా జరిగిన సంభాషణలు తలుపుకు రాగానే సత్తెమ్మ నెత్తిన పిడుగు పడ్డట్టయ్యింది. అయినా తమాయించుకుని నవ్వింది వికటంగా.

* * *

ఆ రోజునుండి తన గదిలోకి మగపురుగు వస్తే సహించేది కాదు కాసులు. తన పొందు కోసం పొద్దు పొద్దూ యింటికొచ్చే ముత్తయ్యకి గట్టిగా వార్నింగ్ యిచ్చింది 'ఇహ తన యింటికి రావద్దని.

"ఒక్కసారికి నన్ను క్షమిస్తున్నావంటే యిక నీ జోలికి రాను" అని ప్రాధేయపడుతున్న ముత్తయ్యని కాలితో తన్నినంత పని చేసింది. ఇలా తన దినచర్యలో ఎన్నెన్నో మార్పులు.... తను అందరిలాగే 'సంసారస్త్రీ' కావాలని, తనకంటూ ఒక అర్థం సమకూర్చుకోవాలని.

ఇన్నాళ్లు తను ఎదురు చూసే ఘడియ ఇన్నాళ్ళకు వచ్చింది. రేపట్నుంచి తన జీవితం సరిక్రొత్త మలుపు తిరగబోతోంది" అనుకుంటూ ఆ ఉత్తరాన్ని ఆవేశంగా ఆప్యాయంగా గుండెలకు అదుముకుంది కాసులు.



"అసల్నీకింత గొప్ప అవుడియా ఎట్టాగొచ్చిందే సత్తెమ్మత్తా!" నులక మంచం మీద కదుల్తా అడిగేడు ముత్తయ్య.

"బుర్రక్కాస్త వదునెట్టాలేగానీ అవుడియాలు దానంతటయ్యే వస్తాయిరా అల్లుడూ.... ఆరోజు ఆ ఇష్టమూర్తి ఎందుకామాటలన్నాడో దాంతో, అప్పట్నుంచీ దాని యెవ్వారమే మారిపోనాది. దానికి అస్తమానూ ఆ ఇష్టమూర్తి జాప్! ఆడివూసు నీకెందుకే అంటే మారుబలికేది గాదు. అప్పుడు తెలిసింది ఇష్టమూర్తిగాడి పేరుసెబితే బప్ప యిది బైటికక్కదల్డని." అని చెప్పి క్షణమాపి మళ్లీ అంది సత్తెమ్మ. "ఒలే ముత్తడూ....యింకో యిసేసం సెప్పనా ఆ ఇష్టమూర్తి దీనికి 'మిత్రా' అని యింకోపేరు సెప్పేడు. కతలూ కాకరగాయిలు రాత్తానని సెప్పినాడు. ఆడిసంగతి ఆరాతీయిస్తే ఆడొట్టి గాలెదవని తెలిసింది. ఆ యిసియం దీంతో సెబితే కథ కంచికి చేరుద్దని యీలు సూస్కొని మెల్లిగా కదిలిద్దామని వున్నా. ఇంతలో నీ బేరం తగిలింది. అందుకని యీ డ్రామా ఆడిసినా! ఒక ముత్తడూ.... జీవితంలో ఎప్పటికైనా గుర్తెట్టుకో ఆడదాన్నయినా యాడకొట్టాలో ఆడ కొడితే ఎంటనే పనైపోద్ది. తెలిసిందా!" ముగించింది సత్తెమ్మ.



"అమ్మనీయమ్మ సత్తెమ్మత్తా మాలావు కొటీసను కొట్టీసినావుగదే! ఒక చాన్సిస్తే సెంట్రల్ గవరమింటునే సెడదున్నీ పేట్టున్నావు!" మెచ్చుకోలుగా చూసేడు ముత్తయ్య.

కాస్సేపు అవిడతో మాట్లాడేక "ఇహ వస్తా! కాసులు జాగర్త. ఈ సంగతి ఏమాత్రం బైటికి పొక్కినా పిట్ట పేజారిపోద్ది." అంటూ పైకిలేచేడు.

"కాసుల్సంగతి నా కొదిలెయ్యి. నువ్వు ఒచ్చేటప్పుడు 'కాసులు' సరిగ్గా లెక్క సూసుకు తీసుకురా. యాభై రూకలకి నయాపైసా తగ్గినా 'కాసులు' నీకు దక్కదు." హెచ్చరించింది సత్తెమ్మ.

"సర్లేవే!" అంటూ బైటికెళ్ళిపోయేడు ముత్తయ్య.

ఈ సంభాషణ వినివుంటే కాసులు తన గదిలో బట్టలు సర్దుకోవడం ఆపేసి ఏడుస్తూ కూర్చునేదేమో. వినకపోవడం వల్ల ఆశగా సూట్‌కేస్‌లో బట్టలు, వస్తువులు సర్దుకోసాగింది.

* * *

రాత్రి!

పదిగంటలు దాటి పదినిముషాలవుతోంది సమయం.

దూరంగా మెయిన్ రోడ్డు కేసి చూస్తున్న కాసులు వచ్చేపోయే వాహనాల నీడల్ని, హెడ్‌లైట్ కాంతిరేఖల్ని పట్టిపట్టి చూస్తోంది. వాటిలో ఏ ఒక్కటీ యాదగిరి పార్కు కేసి రావడం లేదు.

క్షణాలు గడిచేకొద్దీ కాసులు టెన్షన్ ఫీలవుతోంది. ఎంతసేపటికి మిత్రా వస్తున్న జాడలేదు.

యాదగిరి పార్కుమీద పాతబడ్డ చీకటి!

మృత్యువులాంటి సన్నటి గాలిహోరు.

కావవశాత్తు మిణుగురు పురుగుల్లా మారిపోయిన కన్నెపిల్లల నెత్తుటి కేకలు ఆ వాతావరణాన్ని బెదరుస్తున్నాయి.

మనసులో ఏవో నిర్ణయించుకున్న దానిమాదిరి అడుగు ముందుకెయ్యబోయింది సూట్‌కేస్‌ని జాగ్రత్తగా పట్టుకుని.

వెనకనుంచి గుప్పుమని సారావాసన.

కసటు కోరికతో బుసలు కొడుతున్న మానవ మృగం తాలూకు అస్పష్టపు నీడ!

కెవ్వున అరవబోయిందామె.

ఆమె అరుపు పెదవి దాటలేదు.

వెనకనుంచి ఒక చేత్తో ఆమె పొట్ట చుట్టూ బంధనంవేసి మరో చేత్తో ఆమె నోరు నొక్కిన ముత్తయ్య, అతనివెనక వున్న ముగ్గురు వ్యక్తులు చీకటి క్రీనీడల్లో అంగలేసుకుంటూ పార్కు కాపలాదారు ఇంటికేసి వడివడిగా నడిచేరు

వేగంగా కంగారుగా పరుగులాటి నడకతో వస్తున్న వాళ్లని చూసి తలుపు తాళం తీసి తలుపులు బార్లా తెరిచేడు.... పార్కు కాపలాదారు.

ముత్తయ్య ఆయాసంతో బుసలు కొడుతూనే జేబులోంచి పెళపెళలాడే యాభై నోటు అతని కందించేడు. ఆనోటు అందుకుని "ఇల్లు జాగర్త." అన్చెప్పి చీకట్లో కలిసిపోయేడతను.

వెలుతుర్లోకి వచ్చేక వాళ్ల మొహాలు చూసిన కాసులు, వాళ్లంతా తనుండే వీధిలో వుండే అకురాడీలని గుర్తించి అసహ్యంగా క్రీంకరించి ఉమ్మేసింది నేలమీద.

అతి బలవంతంమీద ఆమెను యింటికి సరిగ్గా మధ్యలోన్న నిట్రాడికి కట్టేసేరు వాళ్లు.

"మీరెల్లిపొండి! నేను పిల్చేదాకా లోపలికి రావద్దు!" నాయకుడి మాదిరి ఆజ్ఞాపించేడు ముత్తయ్య. ఆగదిలోవున్న ముగ్గురు మౌనంగా బైటకి నడిచేరు. వాళ్లు వెళ్లాక తలుపువేసి లోపలి గొళ్లెం పెట్టి వెనక్కి తిరిగి కాసులువేపు చూసి మృదువుగా నవ్వుతూ అందులోకి క్రూరత్వం ఒలికించేడు ముత్తయ్య.

"నీ కాబోయే మొగుడు 'మిత్రా' కోసం వచ్చేవటే, వంజకానా!" అంటూ జేబులోంచి బీడీ తీసి వెలిగించేడు ముత్తయ్య, "అదెవ్వరో కాదెహె.... రాజాపావగల్ రోడ్డులో తిరిగే బేకార్ వాయాలు. అది అసలు పేరు ఇష్ణుమూర్తి. ఆరోజు తన పబ్బంకోసం, పైసా కరుసు లేకుండా రాత్రంతా నిన్ను వాడుకుని తను పందెంకాచిన ఐదొందలు నంపాయించుకోటానికి నిన్ను మనువాడతానన్నాడు. అంతేగాని నీమీద పేమ ఎల్లివై కాదు. ఆడు నీకా మాటల్చెప్పగానే మావోల్లందరి నోట్లో మట్టికొడితివి. "ఒక్కసారాయే కాసులా.... అనెక నీ జోలికి రానన్నా నన్ను యిడిలించి కొట్టి కాల్తో తన్నినావుగా ఏదీ... యిప్పుడు తన్ను.... ఏమాత్రం తంతావో చూస్తాను." అంటూ బీడీపొగ గుప్పుమని ఆమె మొహంమీదికి ఊదేడు ముత్తయ్య.

ఆ పొగకి ఉక్కిరిబిక్కిరవుతూ.... "మరి నాకు వచ్చిన ఉత్తరం?" అంది కాసులు అమాయకంగా.

"ఆ రోజు నీ గదిలో మీ యిద్దరి మాటల్ని సత్తెమ్మత్త చాటుగా యిన్నాదంట. ఆ యిసియాలన్నీ తగిలాచ్చేట్టు ఉత్తరం రాయించింది మన యాడిలోనే వుండే తెలుగు పంతులుచేత. ఆదిచేత ఆ ఉత్తరం రాయించటానికి ముప్పయి రూపాయలు ఖర్చయింది. అదంతా ఎవడు బరాయించేడు. నాను! ఎందుకంటావు. నీకోసం. నిన్నెట్టాగయినా వల్లో సిక్కించుకొని నాకసి తీర్చుకోటం కోసం ఆ 'దేవుడి' దయవల్ల అనుకున్నది అనుకున్నట్టు సవ్యంగా జరిగిపోనాది. ఈ రాత్రికి నిన్ను నేనూ, యింకా ముగ్గురు కొనుక్కున్నాం సత్తెమ్మ కాణ్ణించి. నువ్వు అరిచి గీపెట్టినా సరే.... నీ నెత్తురు గిద్దలెక్కన త్రాక్కపోతే నా పేరు చిత్తోళ్ల ముత్తదే కాదు." అంటూ బొడ్లోంచి సారాకాయ తీసి గటగటా త్రాగేసాడు మధ్యమధ్యలో కాసులు కేసి ఆకలిగా చూస్తూ,

అతను చెప్పేదంతా విన్నాక కాసులు కొయ్యబారిపోయింది.

ఆ విష్ణుమూర్తి చేతిలో తానెంత అందంగా మోసపోయింది. తనకు తెల్సి నప్పి తిట్లు తిట్టుకున్నాక మనసులో, భోరున ఏడ్చింది కాసులు. ఆ ఏడుపును ఏ ఓదార్పు కూడా ఆపలేదు.

తాను పుట్టిన దగ్గర్నుంచి యిప్పటి వరకూ చాలామంది చాలా రకాలుగా తనని దబ్బు చేసుకున్నారు. వాళ్లందరికి మల్లే విష్ణుమూర్తి కూడా తనని దబ్బు చేసుకున్నాడు- నాగరిక పద్ధతిలో. అ రోజు రాత్రి అ దృశ్యం కళ్లలో మెదిలే సరికి ఆగిపోతున్న దుఃఖం మళ్లీ రెట్టింపు అయ్యింది.

"ఇప్పుడేమిటి తనకు దారి?" ఏడుస్తూనే ఆలోచిస్తోందామె.

వాళ్ల చేతులు తనమీద పడదమంటూ జరిగితే, వూపిరి కూడా మిగల్దు. చావడానికి తనకేం అభ్యంతరంలేదు. కానీ ఈ రాక్షసుల చేతిలో చచ్చే భయంకరమైన చావు తనకు యిష్టంలేదు. చకచకా ఆలోచిస్తోంది కాసులు.

సారాసీసా ఖాళీచేసి ఓ మూలకు ఖాళీసీసా విసిరేస్తూ కాసులు మీదకి వచ్చేడు ముత్తయ్య.

"ఇప్పటికైనా మనస్పూర్తిగా నాతో గడుపుతానంటావా? లేక.... ముత్తయ్యలో దాక్కున్న 'మూర్ఖుడైన రాక్షసుడి' చేతిలో నరకం చూస్తానంటావా?"

"ముత్తయ్యా.... ఒక్కసారిగా నన్ను చంపెయ్యరాదూ?"

"ఒక్కసారి చంపేస్తే చావులో వున్న మజా తెలిసిరాదు పిల్లా. అంగుళం అంగుళం కోసేస్తూవుంటే మహా మజాగా వుంటుంది" అంటూ సర్రున ఆమె రవికె చించేసి, బ్రాసరీ వెనుక నుంచి తొంగి చూస్తున్న యౌవ్వనపు బరువుల్ని చూస్తూ దాదాపుగా రంకెవేసి ఆమెమీదికి ఎగబడ్డాడు ముత్తయ్య. కెవ్వున కేకేసింది కాసులు. తన జీవితంలో ఎందరో మగాళ్లని చూసినా.... ఆ క్రౌర్యం, ఆ కసి యింతకు ముందెన్నడూ చూడలేదు. నిట్టాటికి కట్టిన కట్లు విప్పదీసి తనని అమాంతం క్రిందికి త్రోసేసి మృగంలా

మీదబడ్డాడు ముత్తయ్య.

ఆ అనూహ్య చర్యకు తల నేలకు కొట్టుకుని తల దిమ్మెక్కిపోయిన కాసులు, తనని ఆక్రమించడానికి మీది మీదికి వస్తున్న ముత్తయ్యని గమనించి ఆత్మరక్షణకోసం అన్నట్లు అటూ యిటూ చూసింది.

ఖాళీ సారా పీసా!

తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

ముత్తయ్య తనని ఆక్రమించు కొంటుంటే అడ్డు చెప్పలేదామె.

కానీ అతడు స్వర్గానికి 'బెత్తెడు' దూరంలో వున్న క్షణాన ఖాళీ పీసా పగిలింది. ఆ మరుక్షణం అది ముత్తయ్య గుండెల్లో దిగింది.

చటుక్కున పైకిలేచి పెరటి తలుపు త్రోసుకుంటూ చీకట్లోకి పరుగెత్తింది కాసులు!

పూటుగా త్రాగి వస్తున్న పార్కు కాపలాదారుకి కనుచీకట్లో కాసులు గుడ్డిగా పరుగెత్తుతూ కనిపించింది. అవిద్న మసక వెలుతురులో కాసులు అని గుర్తించేసరికి అతన్ని దాటి చాలా దూరం పారిపోయిందామె

మరొక్క క్షణం ఆలోచించకుండా ఆమెను అందుకోవాలని తనూ ఆమెవెంట పరుగెత్తసాగాడు సమానవేగంతో.

బాణంలా రివ్వున దూసుకుపోతోంది కాసులు.

ముళ్లు, రాళ్లు, గోదలు! ఇవేం లెక్కచేయటల్లేదామె. ఒక ఎదుర్రాయి ఆమెను క్రిందకు నెట్టేస్తే మరొక రాయి ఆమె మోకాళ్లని చీల్చి నెత్తురు త్రాగేసింది. ఒకముల్లు చీరని చింపేస్తే మరొకముల్లు పాదాల్ని చీల్చి వచ్చినెత్తుటి రుచి చూసింది.

అయినా యికేం లెక్కచెయ్యనట్టు పరుగెడుతోందామె.

శ్వాస సరిగ్గా అందడంలేదు.


నాలుక పూర్తిగా తడారిపోయింది.

కాళ్లను అడ్డుపడుతున్నా ఎలాగో తప్పించుకుంటూ పడుతూ లేస్తూ ఎలాగోలా మెయిన్ రోడ్డెక్కగలిగింది కాసులు.

పిచ్చికుక్కల్లా పరుగెత్తుతున్నాయి వాహనాలు. ఎందుకో వెనక్కితిరిగి చూసింది. పార్కు కాపలాదారు వేగంగా పరుగెత్తుతూ కనిపించేడు. క్షణం ఆలస్యం చెయ్యక పరుగందుకుందామె. ఆ పరుగు ఎంతోసేపు సాగలేదు. చిరిగిన చీర పేలిక కాళ్ళకి అడ్డుపడింది. తూలి ముందుకు పడింది. ఎదురుగా వస్తున్న రోల్స్‌రాయిస్ ఆమెను పైకిలేచే అవకాశం యివ్వలేదు. ఆమె ప్రాణాల్ని లాగేసుకున్న కారు అల్లంత దూరాన పోయి ఆగింది. అందులోంచి ఓ సూట్








వాలా దిగేడు కంగారుగా!

చొంగ కార్చుకుంటూ పరుగెత్తుకొస్తున్న పార్కు కాపలాదారు తన కాళ్ళకి బ్రేకులు పడ్డట్టు ఆగిపోయేడు. కారులోంచి దిగిన సూట్‌వాలాని చూసి ఏదో స్ఫురించి, "అమ్మా .... ఎంకటలచ్చిమీ...." అంటూ ఏడుస్తూ వచ్చి నెత్తురు మడుగులా మారిపోయిన కాసులు శవం దగ్గరకొచ్చి ఏడవడం మొదలెట్టేడు పెద్దగా. వేగంగా వెళ్తున్న వాహనాలు యీ గొడవేం పట్టించుకోకుండా తమ దార్న తాము వెళ్ళిపోతున్నాయి.

"ఎవరీమె?" సూట్‌వాలా ప్రశ్న.

"ఎంకటలచ్చిమి అని నా సెల్లి బాబో. దాని కిట్టంలేని మడిసితో పెళ్ళి సేత్తన్నామని పారిపోయి పరిగెడతాంది. నా సెల్లి నా సేతికి అందబోయే లోపున యముడికిమల్లే తమరొచ్చి దాని పేనాల్తీసినారు. అమ్మా ఎంకటలచ్చిమీ .... నా బంగారుకొండా.... నా సెల్లెలా!" ఏడుస్తున్నా డతను. అయినా మనసులో సూట్‌వాలా దగ్గర ఎంత డబ్బు డిమాండ్ చేయాలా అని ఆలోచిస్తున్నాడు పార్కు కాపలాదారు.

తనకి డబ్బుకన్నా కాలమూ, పరువు ప్రతిష్టలు ముఖ్యమైనవి గనుక 'అతడు' ఎంతడబ్బు అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా వున్నాడు సూట్‌వాలా. అప్పుడే గాలిలోకి ఎగిరిన కాసులు-వూపిరి ఆ దృశ్యంచూసి పగలబడి నవ్వసాగింది.

—০—